

వసతులపై దృష్టి పెట్టండి : కలెక్టర్

రాజానగరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పి.ప్రశాంతి వివిధ శాఖల అధికారులకు ఆదేశించారు. హౌసింగ్ డేను పురస్కరించుకుని శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి మండలంలో వెలుగుబంద, కానవరం,పల్లకడియం గ్రామాల్లో లేఅవుట్లను పరిశీలించారు.లేఅవుట్లలో అంతర్గత రహదారుల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

మహిళా..! ఉచిత బస్.. వచ్చేస్తోంది..!



మహిళలకు శుభవార్త.. సీఎం చంద్రబాబునాయుడు ఒక్కొక్కటిగా హామీలు నెరవేరుస్తున్నారు.. మరో హామీ నెరవేర్చనున్నారు.. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం హామీ అమలుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ కానుకగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం సౌకర్యం కల్పిస్తామని సీఎం వెల్లడించారు. ఆ దిశగా తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో బస్‌లు సిద్ధం చేస్తున్నారు.

- ఆగస్టు 15 నుంచి అమలు
- ఉమ్మడి జిల్లా పరిధిలో ఉచితం?
- ఆర్టీసీ డిపోల్లో చురుగ్గా పనులు
- 'పల్లె వెలుగు'లకు మెరుగులు
- యుద్ధప్రాతిపదికన బస్సులు సిద్ధం
- రోజుకు రూ.30 లక్షల భారం
- మహిళల ఆనందం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మహిళలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15.. స్వాతంత్ర్య దినోత్సవం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఈ పథకం ఢిల్లీ, తెలంగాణ, కర్నాటకల్లో అమలవుతోంది. ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' ప్రధానమైన వాగ్దానం. పథకం ప్రారంభించిన తర్వాత ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకూడదనే ఉద్దేశంతో ఆ రాష్ట్రాల్లో ఇప్పటికే అధ్యయనం చేయించి ఒక అంచనాకు వచ్చారు. విధివిధానాలను ఖరారు చేసే పనిలో ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ పథకం అమలు దాదాపు చివరి అంకంలో ఉంది. ఈ మేరకు అవసరమైన బస్సులను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేస్తున్నారు.

బస్‌లకు మరమ్మతులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి, నిడదవోలు, కొవ్వూరు, కాకినాడ, తుని, ఏలేశ్వరం, అమలాపురం, రాజోలు, రామచంద్రాపురం, రావులపాలెం డిపోల్లోని పల్లె వెలుగు బస్సులను పూర్తిగా పరీక్షించి ఆ మేరకు మరమ్మతులు చేస్తున్నారు. పథకం ప్రారంభించిన తర్వాత బస్సుల సీటింగ్ కెపాసిటీకి మించి రద్దీగా ప్రయాణికులు ఉండే అవకాశం ఉంది. ఈమేరకు కొన్ని డిపోలకు కొత్తగా సూపర్ లగ్జరీ బస్సులు ఇచ్చారు. బాగా పాతబడిన వాటి బాడీలను పల్లెవెలుగు బస్సులతో మార్పుచేస్తున్నారు. గణాంకాలు పరిశీలిస్తే మొత్తం ఒక రోజులో ప్రయాణించే వాళ్లలో పల్లె వెలుగు బస్సుల్లో 50 శాతం రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్పు పనులను ఆయా జిల్లాల జిల్లా ప్రజా రవాణా అధికారులు (డీపీటీవోలు) ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తున్నారు. ఈడీ విజయరత్నం ప్రతిరోజూ సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాకు ఉచితమట!

ఉచిత ప్రయాణం ఉమ్మడి జిల్లా ప్రాతిపాదికన కల్పిస్తారనే చర్చ నడుస్తోంది. అంటే తూర్పుగోదావరి జిల్లా మహిళలు కోనసీమ, కాకినాడ జిల్లాల వరకూ ప్రయాణించవచ్చు. వారికి జీరో టికెట్ ఇస్తారు. దీనిలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఉదాహరణకు కొవ్వూరు ఉమ్మడి పశ్చిమ గోదావరి పరిధిలోకి వస్తుంది. కానీ కొత్త జిల్లాల విభజనలో తూర్పులో కలిసింది. ఇప్పుడు ఉమ్మడి జిల్లాల పరిధి అమలు చేస్తే ఏలూరు నుంచి కొవ్వూరు వరకూ ఉచితంగా వచ్చేసి, అక్కడి నుంచి రాజమండ్రికి టికెట్ కొనుక్కోవాల్సి రావచ్చు. ఇంకో ఐదు కిలోమీటర్లే కదా అని టికెట్ తీసుకోని వారి సంఖ్యా ఉంటుంది. వీళ్లను గుర్తించడం కష్టంగా మారొచ్చు. ఆర్టీసీ అవిధంగానూ ఆదాయం కోల్పోయే అవకాశం లేకపోలేదు. ఇక ఉచిత ప్రయాణం మొదలు పెట్టిన తొలి రోజుల్లో తెలంగాణ, కర్నాటక చాలా కష్టాలు ఎదుర్కొన్నాయి. ఆయా ఇబ్బందులను అధిగమించే దిశగా ఆలోచన చేస్తున్నారు. దీంతో త్వరలోనే ఉచిత బస్ ప్రయాణం అమల్లోకి రానుంది.

ఉమ్మడి జిల్లాలో 532 బస్సులు

తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 285 బస్సులు ఉండగా 165 పల్లెవెలుగు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 291కి 191, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 300కి 176 పల్లెవెలుగులు ఉన్నాయి. అంటే ఉమ్మడి తూర్పుగోదావరిలో మొత్తం అన్ని రకాల బస్సులు కలిపి 876 ఉండగా, వాటిలో 532 పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు ఉన్నాయి. వీటన్నిటినీ యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం తూర్పుగోదావరిలో 89 వేలు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 80 వేల చొప్పున కలుపుకొని రోజుకు సరాసరిన 2.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగులో దాదాపు 50 శాతం మంది ప్రయాణిస్తున్నారు. మూడు జిల్లాల్లోని 11 ఆర్టీసీ డిపోల్లో రోజుకు రూ.1.20 కోట్ల ఆదాయం సమకూరుతోంది. వీటిలో పల్లె వెలుగు వాటా దాదాపు రూ.60లక్షల పైనే ఉంటుంది. మొత్తం ప్రయాణికుల్లో 50 శాతం మహిళల లెక్కన చూసినా రోజుకు రూ.30 లక్షల వరకూ ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది.



బస్‌లు మెరుగుపరుస్తున్నాం..



మహిళలు ప్రయాణించే బస్సులు కాబట్టి బయలుదేరిన తర్వాత ఎలాంటి సమస్యలూ ఉత్పన్నం కాకుండా మెరుగు పరుస్తున్నాం. యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి.ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సూచనలు చేస్తున్నారు. వాటికి తగినట్లుగా పనులు చేయిస్తున్నాం. ప్రభుత్వానికి చెడ్డ పేరు రానీయకుండా బస్సులు తిప్పుతాం.

- సత్యనారాయణ మూర్తి, డీపీటీవో,తూర్పుగోదావరి



స్కెచ్‌కు బ్రేక్!

గనుల గలీజు పని బయటపెట్టిన ఆంధ్రజ్యోతి

- లీజు దరఖాస్తుల పరిశీలనకు బ్రేక్
- వారం రోజులపాటు నిలిపివేత
- సర్వేయర్ పన్నాగానికి చెక్
- డీడీతో నేడు కాకినాడ కలెక్టర్ సమీక్ష
- కలెక్టర్‌ను కలిసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే
- దరఖాస్తుల రద్దుకు డిమాండ్
- సర్వేయర్ వెనకేసింది రూ.కోటి పైనే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పక్కా 'స్కెచ్'కు బ్రేక్ పడింది. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం పక్కాగా 'స్కెచ్' అంటూ వచ్చిన కథనం గనుల శాఖలో తీవ్ర కలకలం రేపింది. దీంతో ఉమ్మడి జిల్లాలో మైనింగ్ లీజుల కోసం దాఖలైన దరఖాస్తులన్నింటిని ఓ వారం పాటు పరిశీలించకుండా పక్కన పెట్టాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రాజమహేంద్రవరంలోని గనుల శాఖ సర్వేయర్ ముందస్తు పథకంతో మైనింగ్ స్కెచ్‌లన్నీ అడ్డగోలుగా విక్రయించి అరకోటికి పైగా సంపాదించడంతో పాటు అనేక మంది దరఖాస్తుదారులకు స్కెచ్‌లే లేకుండా చేసి వారిని దెబ్బతీశాడు. అటు ఒకే స్కెచ్‌ను ఒకరికి తెలియకుండా మరొకరికి విక్రయించి అడ్డంగా బరితెగించేశాడు. రాజమహేంద్రవరం గనులశాఖ ఏడీ కార్యాలయ సర్వేయర్ మైనింగ్ స్కెచ్‌లన్నీ ముందే తన వద్దకు రప్పించి దరఖాస్తుదారులకు హెక్టారుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు విక్రయించేసిన విషయం వెలుగులోకి తేవడం తీవ్ర కలకలం రేపింది. ఆంధ్రజ్యోతి కథనం నేపథ్యంలో అనేక మంది దరఖాస్తుదారులు తమకు సైతం స్కెచ్‌లు ఇవ్వకుండా చేసి లీజు రాకుండా కుట్రపన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరైతే తాము సదరు సర్వేయర్‌కు రూ.5 లక్షలు ఇచ్చి కొనుగోలు చేసిన స్కెచ్‌ను మరొకరికి విక్రయించడంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అనేకమంది సర్వేయర్ బాధితులు బయటకు వచ్చారు. అటు సర్వేయర్ ముందస్తు పథకంతో స్కెచ్‌ల పేరుతో దందాలు నడిపిన నేపథ్యంలో సోమవారం నుంచి పరిశీలన ప్రక్రియ ప్రారంభించాల్సిన దరఖాస్తులన్నింటిని నిలిపి వేయాలని గనులశాఖ నిర్ణయించింది. ఈలోపు జరిగిన తంతంగంపై పూర్తిస్థాయిలో వివరాలు రాబట్టాలని కాకినాడ కలెక్టర్ మైనింగ్ డీడీని ఆదేశించారు. అందులోభాగంగా స్కెచ్‌ల పేరుతో అసలు జరిగిన కథేంటనేది తేల్చాలని కలెక్టర్ నిర్ణయించారు.ఈ మేరకు ఆదివారం మైనింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో ఎన్ని స్కెచ్‌లు ఉన్నాయి? ఎంత మందికి విక్రయించారు? వసూలు చేసిందెంత? దీని వల్ల స్కెచ్‌లు దకక్క నష్టపోయిన వారెందరు? అనేది ఈ సమావేశంలో నిగ్గు తేల్చనున్నారు. తద్వారా వచ్చిన దరఖాస్తులను పూర్తిగా పక్కనపెట్టి కొత్తగా దాఖలు చేయించాలా? లేదంటే తదుపరి వ్యూహం ఏంటనేది అమరావతిలో గనులశాఖ ఉన్నతాధికారులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాఖలైన 53 మైనింగ్ లీజు దరఖాస్తుల్లో 45 ఒక్క రౌతులపూడిలోని క్వారీలకే వచ్చాయి. స్కెచ్‌లు కొందరికే దక్కేలా మాయ చేసిన నేపథ్యంలో దరఖాస్తులను రద్దు చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం కాకినాడ జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. అవకతవకలు లేకుండా పారదర్శకంగా దరఖాస్తుల ప్రక్రియ మళ్లీ జరిగేలా చూడాలని కోరారు. అటు గనులశాఖ డీడీ సైతం ఆంధ్రజ్యోతి కథనాన్ని అమరావతిలోని గనులశాఖ డీఎంజీ దృష్టికి తీసుకువెళ్లారు. మరో పక్క సర్వేయర్ గలీజు దందా సంచలనంగా మారడంతో శనివారం కార్యాలయానికి సదరు ఉద్యోగి డుమ్మా కొట్టారు. ఇదంతా ఒకెత్తయితే మైనింగ్ స్కెచ్‌లను విక్రయించిన సదరు రాజమహేంద్రవరం ఏడీ కార్యాలయ సర్వేయర్ బండారం మరింత బయటపడుతోంది. మూడు రోజుల్లో స్కెచ్‌లు విక్రయించి వెనకేసింది రూ.కోటికిపైనే అని సమాచారం.తనకు ముడుపులు ముట్ట జెప్పిన దరఖాస్తుదారులకు మైనింగ్ స్కెచ్‌లు ఇవ్వడంతోపాటు ఫస్ట్ కం ఫస్ట్ విధానంలో లీజులు దక్కుతుండడంతో అవి వచ్చేలా చేయడం కోసం కొందరు లీజుదారులతో వ్యాపారంలో వాటాలు ఖాయం చేసుకోవడం విశేషం. ఇదంతా తెలిసిన అధికారులే ఖంగుతింటున్నారు.. ఇక ఆదివారం జరిగే సమీక్షలో ఏం నిర్ణయం తీసుకుంటారో..

పరిమితి మించిన ఇసుక లోడింగ్‌పై చర్యలు

అధికారులతో సమీక్షలో కలెక్టర్

రాజమహేంద్రవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ఇసుకను లోడ్ చేస్తే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఇసుక విధానం అమలుపై సమీక్షించారు. తాళ్లపూడి ,పక్కిలంక,వేగేశ్వరపురం డీసిల్టేషన్ ర్యాంపుల నుంచి అధిక లోడ్‌తో వచ్చే వాహనాలు సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే నిబంధనలు పాటించని డీ సిల్టేషన్ రీచ్‌ల ఏజెన్సీల లైసెన్స్‌లు రద్దు చేయాలని స్పష్టం చేశారు. వాహనాల లోడింగ్, రోడ్లపై పడిన ఇసుక తొలగింపు బాధ్యత ఆయా ఏజెన్సీలదేనని, వీటి పర్యవేక్షణ బాధ్యత ఆయా మండల స్థాయి అధికార్లకు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నట్టు చెప్పారు.జిల్లాలో అక్టోబరు 15వతేదీ వరకూ ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వకాలపై నిషేధం ఉందన్నారు. సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి ఎం.ఫణిభూషణ్‌రెడ్డి,జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

హాస్టల్‌లో హాజరు అక్రమాలపై విచారణకు ఆదేశం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ కళాశాల బాలుర హాస్టల్ నెం.1లో జరిగిన విద్యార్థుల బయోమెట్రిక్ హాజరు అక్రమాలపై డొంక కదులుతోంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణకు ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్‌లోని విద్యార్థుల హాజరు సమయంలో బయోమెట్రిక్ హాజరును పక్కనబెట్టి మాన్యువల్ విధానం ద్వారా అవకతవకలకు పాల్పడుతూ హాస్టల్ వార్డెన్ రూ.లక్షల్లో సాగించిన అక్రమాల భాగోతం నిగ్గు తేల్చేందుకు జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టనున్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ఏఎస్‌డబ్ల్యువో సత్యనారాయణను విచారణాధికారిగా నియమించారు. వారం రోజుల్లోగా విచారణ పూర్తి చేసి నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు విచారణాధికారి తన పరిధిలోని హాస్టళ్లకు సంబంధించిన వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. సోమవారం నుంచి సమగ్ర విచారణ జరిపే అవకాశాలున్నాయి. ఇదిలా ఉండగా హాస్టల్స్ వార్డెన్ల అక్రమాస్తులు, వారి అవినీతిపై ఏసీబీ దాడులు జరపాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

బేబీ కిట్టు.. అందేటట్టు!

త్వరలో అందించనున్న కూటమి ప్రభుత్వం



కిట్‌లో ఏం ఉంటాయంటే..

ఎన్టీఆర్ బేబీ కిట్‌లో 11 రకాల వస్తువులు ఉంటాయి. దీని ధర రూ.1410గా ప్రభుత్వం నిర్ణయించింది. చిన్నారి తల్లితోపాటు శిశువు నిద్రపోయేందుకు బెడ్, దోమ తెర, తల్లులు చేతులు శుభ్రం చేసుకునే ద్రావణం, సబ్బు, పౌడర్, న్యాప్‌కిన్, రెండు తువ్వాళ్లు, చిన్న బొమ్మ ఉంటాయి. ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్టీఆర్ బేబీ కిట్లను తిరిగి పంపిణీ చేయాలని నిర్ణయించింది.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

- పాత పథకం పునరుద్ధరణ
- ప్రభుత్వాసుపత్రుల్లో అందజేత
- 2021 నుంచి నిలిపేసిన వైసీపీ
- నెలాఖరు నుంచి అమలు యోచన


నాడు టీడీపీ ప్రభుత్వం అందజేసిన పలు ప్రజాసంక్షేమ పథకాలను గత వైసీపీ ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో చాలా మందికి ఆ పథకాలు దూరమయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. మళ్లీ తిరిగి వాటిని ప్రజలందరికీ చేర్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ప్రభుత్వ వైద్యశాలల్లో జన్మించిన చిన్నారులకు రక్షణ కల్పించేందుకు బేబీ కిట్లను పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది. అధికారంలో ఉన్నంతకాలం పథకాన్ని అమలుచేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకం పేరు మార్చింది. కిట్లను పూర్తిగా అటకెక్కించింది. 2021 నుంచి పూర్తిగా నిలిపివేసింది. దీంతో పేద ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. బయట కొనుగోలు చేసుకునే ఆర్థిక స్తోమత లేక అవస్థలుపడ్డారు. గతంలో తాము అధికారంలో ఉండగా అమలు చేసిన ఈ పథకాన్ని మళ్లీ అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. దీనిలో భాగంగానే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేసుకునే బాలింతలకు ఈ కిట్లు అందజేయనుంది.

ఈ నెలాఖరు నుంచి కిట్లు

జిల్లాల్లోని డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, జీజీహెచ్‌లకు రెండేళ్లపాటు రేట్ కాంట్రాక్టు పద్ధతిలో కిట్లు సరఫరా చేసేలా టెండర్లు పిలిచారు. ఆ బాధ్యతను ఆంధ్ర ప్రదేశ్ వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ)కు ప్రభుత్వం అప్పగించింది. అర్హత కలిగిన తయారీదారులు, అధికారిక డిస్ట్రిబ్యూటర్లు ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో బిడ్లు సమర్పించాలని పేర్కొంది. ఈ నెలాఖరు నుంచి ఈ బేబీ కిట్లు పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడాదికి సుమారు 50 వేల వరకు ప్రసవాలు జరుగుతున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రసవాలు జరిగితే కుటుంబ సభ్యులు కిట్లను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి. దీని ఖరీదు రూ.1500 నుంచి రూ.2 వేల వరకు ఉంటోంది. నిరుపేదలైన వారు కొనుగోలు చేసే పరిస్థితి లేక అలాగే ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఈ ప్రభావం చిన్నారుల ఆరోగ్యంపై పడుతుంది. వివిధ రకాల రుగ్మతలతో బాధపడే అవకాశం ఉంది. అలాంటి వారికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఎంతో మేలు కలుగుతోంది.

రాజీపడితే తగ్గినట్టు కాదు.. నెగ్గినట్టు!

లోక్ అదాలత్ ప్రారంభంలో పీడీజే గంధం సునీత



బాధిత కుటుంబానికి రూ.కోటి నమూనా చెక్ అందజేస్తున్న ఉమ్మడి జిల్లా జడ్జి సునీత

రాజమహేంద్రవరం, జూలై5(ఆంధ్ర జ్యోతి): సత్వర న్యాయమే లోక్ అదాలత్‌ల లక్ష్యమని.. రాజీ పడితే తగ్గినట్టు కాదని.. నెగ్గినట్టని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా శనివారం 47 బెంచ్‌లపై జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. రాజమహేంద్రవరం డీఎల్ఎస్ఏ సమావేశ మందిరంలో పీడీజే ప్రారంభించి మాట్లాడారు. రాజీమార్గం ఎప్పుడూ రాజమార్గమన్న విషయం మరువరాదన్నారు. జిల్లాలో మొత్తం 85వేల కేసులు పెండింగ్‌లో ఉండగా 60, 642 రాజీకి యోగ్యమైనవన్నారు. వీటిలో 9,272 సివిల్, క్రిమినల్, 2136 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయన్నారు. పీడీజే కోర్టులో కేసు నెం.1/2025కి సంబంధించి కక్షిదారుడి కుటుంబానికి ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా చెల్లించే రూ.1.15 కోట్ల పరిహారం నమూనా చెక్కు అందజేశారు. శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 47 బెంచ్‌లపై 6,179 వేల కేసులను పరిష్కరించారు. ఇందులో సివిల్ 473, క్రిమినల్ 5,514, పీఎల్‌సీ 192 కేసులు ఉన్నాయి. రాత్రి 9.30 గంటల తర్వాత పూర్తయిన కేసుల సంఖ్యను లెక్కిస్తున్నారు. లోక్ అదాలత్‌లో బాధితులకు 18,67,73, 973 పరిహారం అవార్డును చెల్లించారు.

10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ఈ నెల 10న నిర్వహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మెగా సమావేశానికి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి మెగా మీటింగ్, పీ4, అన్నదాత సుఖీభవ పథకాలపై జిల్లా అధికారులతో శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్, ఎయిడెడ్ ,అన్‌ఎయిడెడ్,రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇంటర్ కళా శాలల్లో కూడా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఏక్‌పేడ్ మాకే నామ్ (తల్లిపేరుతో ఒక మొక్క) అన్న ప్రధాని సూచన మేరకు చిన్నారులతో మొక్కలు నాటించాలని చెప్పారు. తల్లికి వందనం పథకానికి సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పీ4 కార్యక్రమం అమలుకు గ్రామస్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో గ్రామ సర్పంచ్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ ,వీఆర్వో,పంచాయితీ కార్యదర్శి సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఇప్పటికే బంగారు కుటుంబాల గుర్తింపు పూర్తయిందని, వచ్చే నెల 15వ తేదీలోపు దత్తత ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ప్రతి మండలంలో కొన్ని సచివాలయాలను మునిసిపల్ కమిషనర్లు, తహశీలార్లు,ఎంపీడీవోలకు అప్పగిస్తామన్నారు. అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ కే.భాస్కర్‌రెడ్డి, డ్వామా పీడీ ఎం.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

డీఈవోకు ఫ్యాప్టో నాయకుల వినతి

రాజమహేంద్రవరం అర్బన్ : మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో విట్‌నెస్ అధికారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులే నియమించుకుని వారిచేతనే వీడియోలు తీయించి అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్షణ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం రద్దు చేయాలని ఫ్యాప్టో డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం జిల్లా ఫ్యాప్టో నాయకులు డేనియల్ బాబు. పి. జయకర్, ఏ.షరీఫ్, సువర్ణరాజు తదితరులు డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

గోదారి..రంగు మారి!





ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు వరద నీరు వచ్చి గోదావరిలో కలుస్తోంది. దీంతో గోదావరి నది కొత్త రంగులో కనిపిస్తోంది. ఎర్ర నీరు ఎక్కువగా వచ్చి చేరడంతో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నీరు రంగు మారిన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.
– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

స్వల్పంగా పెరిగిన గోదావరి నీటి మట్టం

1,89,129 క్యూసెక్కులు సముద్రంలోకి



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద

ధవళేశ్వరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల వాగులు, వంకలు నుంచి వచ్చి చేరుతున్న నీటితో గోదావరి స్వల్పంగా పెరిగి ప్రవహిస్తుంది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం ఆర్మ్‌లోని 66గేట్లు, ర్యాలీ ఆర్మ్‌లలోని 42గేట్లు, మద్దూరు ఆర్మ్‌లో 20గేట్లు, విజ్జేశ్వరాలయంలో 29 గేట్లను 40 మీటర్ల మేర పైకి ఎత్తి 1,89,129 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.80అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 4200 క్యూ సెక్కులు, మధ్యడెల్టాకు 2450క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5800 క్యూసెక్కులు చొప్పున సాగు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద స్వల్పంగా పెరిగిన నీటి మట్టం శనివారం సాయంత్రం 20.30 అడుగులుగా నమోదైంది.

ఉరకలేస్తున్న పొల్లూరు జలపాతం



మోతుగూడెం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పొల్లూరు జలపాతం ఉరకలేస్తోంది. సుమారు 50 అడుగులు పై నుంచి నీటి ప్రవాహం కిందకు పడుతుంది. దీంతో పర్యాటకులు జలపాతం వద్ద గడిపేందుకు తరలివస్తున్నారు.

జంతుప్రేమ.. జాగ్రత్త సుమా!

పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ తప్పనిసరి

నేడు వరల్డ్ జూనోసిస్ డే



పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

కాకినాడక్రైం, జూలై5(ఆంధ్రజ్యోతి): జంతు ప్రేమికులు నానాటికి పెరుగుతున్నారు. ముఖ్యంగా శునకాలను, పిల్లులను పెంచేవారి సంఖ్య నగరాల్లో, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో క్రమంగా పెరుగుతుంది. అలాంటి పెంపుడు జంతువులకు వ్యాధులు సోకకుండా చూసుకునే బాధ్యత పెంపకందార్లపై ఉంటుంది. జూనోసిస్ వ్యాధి అనేది జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు వచ్చే వ్యాధి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటి వరకు 250 జూనోటిక్ వ్యాధులను గుర్తించింది. పిచ్చి కుక్క కాటుకు గురైన వ్యక్తికి 1885 సంవత్సరం జూలై 6న లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త తొలిసారి యాంటి ర్యాబీస్ టీకాను వేసి విజయం సాధించారు. ఈ కారణంగా ప్రతి సంవత్సరం జూలై 6న ప్రపంచ జూనోసిస్ డేగా జరుపుకోవడం జరుగుతోంది. ఈ వ్యాధి ప్రాణాంతకం. సాధారణంగా వ్యాక్సినేషన్ కాని జంతువు కరవడం వల్ల ర్యాబీస్ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. పిచ్చికుక్క కరిచిన నాలుగు నుంచి ఏడు వారాలలోపు ర్యాబీస్ వ్యాధి లక్షణాలు బయట పడి మనిషి మృత్యువాత పడడం ఖాయం. ఈ నేపథ్యంలో పెంపుడు కుక్కలకు అలాగే వీధి కుక్కలకు తప్పనిసరిగా యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేయించాలి. జూనోసిస్‌డే సందర్భంగా జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు ప్రతి పెంపుడు శునకానికి ప్రతి పశువైద్యశాలలో ఉచితంగా యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేయడం జరుగుతుంది. జిల్లాకు 28 వేలు యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్‌లు సమకూర్చినట్టు పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.కృష్ణమూర్తి తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి పశువైద్యశాలలోను యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. జంతు ప్రేమికులు తమ పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేయించి వాటిని సురక్షితంగా ఉంచడంతోపాటు వాటి యజమానులు సురక్షితంగా ఉంటారని డాక్టర్ కృష్ణమూర్తి అన్నారు.

టీడీపీ కాపు సామాజిక ప్రజాప్రతినిధుల ఆత్మీయ కలయిక



తెలుగుదేశం కాపు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆత్మీయ కలయికలో ఎంపీ సతీష్‌బాబు, వంగవీటి రాధా

సామర్లకోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి చెందిన కాపు సామాజిక ప్రజాప్రతినిధుల ఆత్మీయ కలయిక కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కొప్పవరంలోని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయ ఆవరణలో శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కాపు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ హాజరయ్యారు. ఎంపీ సతీష్‌బాబు నేతృత్వంలో కాపు ప్రజాప్రతినిధులు కొద్దిసేపు అంతరంగికంగా సమావేశమయ్యారు. ప్రధానంగా కాపు సామాజికవర్గానికి చెందిన పలు సమస్యలను వివాదాలకతీతంగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లేందుకు కాకినాడ జిల్లా తరపున ఎంపీ సతీష్‌బాబు సారథ్యం వహించేందుకు ఇప్పటికే రాష్ట్ర కాపు నాయకులకు సుముఖత వ్యక్తం చేసిన విషయం విదితమే. అందులో భాగంగా ముందుగా టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులను తన క్యాంపు కార్యాలయంలో ఆత్మీయ కలయిక ఏర్పాటుచేయడమే గాక వంగవీటి రంగా తనయుడు వంగవీటి రాధాను రప్పించడంలో ఎంపీ సతీష్‌బాబు కృషిచేశారు. అదే తరుణంలో కాపు ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన రాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జ్యోతుల నవీన్‌తో కలిసి ఎంపీ సతీష్‌బాబు, వంగవీటి రాధా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఆత్మీయ విందు స్వీకరించారు. విందులో టీడీపీ కాకినాడ పార్లమెంటరీ కమిటీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, పార్టీ నాయకులు ఆకుల రామ కృష్ణ, గంధం పల్లంరాజు, మోటుకూరి వెంకటేష్, అల్లాడి శరత్, చిక్కాల గణేష్, రాయపురెడ్డి రాజా, ఎస్ఎన్.రాజా, మెట్ల రమణబాబు, ఆరేటి ప్రకాష్, చింతపల్లి అర్జున్, ఆనంద్‌న్యూటన్, ఏసుదాసు పాల్గొన్నారు.

వంగవీటి రాధాకు సత్కారం

కాకినాడ జిల్లా పర్యటనకు విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణను సామర్లకోట మండలం కొప్పవరంలోని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఎంపీ నేతృత్వంలో రాధాకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జ్యోతుల నవీన్, ఆకుల రామకృష్ణ, ఆంధ్రా కాపు సద్భావనా సంఘం రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, బసవా ప్రభాకరరావు, సిద్దు నూకరాజు, గొల్లపల్లి లక్ష్మణరావు, వల్లకూడి బాబ్జీల చేతులమీదుగా జ్ఞాపికను రాధాకు అందజేశారు.

అల్లూరి కలెక్టర్, గిరిజన సంక్షేమ కార్యదర్శికి

జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు

రంపచోడవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలో రెవెన్యూ అధికారులు ఇటీవల చేపట్టిన ఆక్రమణల తొలగింపులో భాగంగా గిరిజనులకు చెందిన ఇళ్లను కూడా కూల్చేసిన ఘటనలపై జాతీయ ఎస్టీ కమిషన్ అల్లూరి జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. రంపచోడవరానికి చెందిన ముర్ల లక్ష్మి అనే గిరిజన మహిళ రెవెన్యూ అధికారులు చట్టవిరుద్ధంగా తన ఇంటిని ఎక్స్‌కవేటర్‌తో కూల్చేసి తనకు నష్టాన్ని చేకూర్చారని ఫిర్యాదు చేశారు. ఇందుకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం తహశీల్దార్‌గా పనిచేసిన రామకృష్ణ తదితరులు బాధ్యులని, వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించి భువనేశ్వర్‌లోని ప్రాంతీయ కార్యాలయం అల్లూరి కలెక్టర్, గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శికి నోటీసు జారీ చేసి 30 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించింది.

760 టన్నుల ఇసుక నిల్వలు స్వాధీనం

6 టన్నుల ఇసుకతో లారీ బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌కు అప్పగింత



దివాన్‌చెరువులో ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

దివాన్‌చెరువు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులోని బీజాపురి టౌన్‌షిప్‌లో రెండు వేర్వేరు ప్రాంతాల్లోని భారీ ఇసుక నిల్వలను టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం శనివారం స్వాధీనం చేసుకుంది. అలాగే 6 టన్నుల ఇసుకలోడ్‌తో పాటు లారీని స్వాధీనపరచుకున్నారు. వివరాల ప్రకారం.. దివాన్‌చెరువులోని బీజాపురి టూన్‌షిప్‌లో టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం దాడులు చేసింది. ఆ సమయంలో ఒకప్రాంతంలో నిల్వ చేసిన 260 టన్నుల ఇసుక, మరోచోట నిల్వ చేసిన 500 టన్నుల ఇసుక మొత్తం 760 టన్నుల నిల్వలను అధికారులను స్వాధీనం పర్చుకున్నారు. దీంతో పాటు 6 టన్నుల లోడ్‌తో అక్కడికి వచ్చిన ఇసుక లారీ బిల్లులను పరిశీలించారు. అయితే ఆ బిల్లులో శనివారం ఉదయం సమయంతో ఉందని, మధ్యాహ్నం 12 గంటల వరకే ఈ బిల్లు పనిచేస్తుందని టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ కె.ఆంజనేయులు తెలిపారు. సమయం మించి సాయంత్రం కావడం వల్ల 6 టన్నుల ఇసుకతో పాటు లారీని స్వాధీనపర్చుకుని బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామన్నారు. అలాగే దివాన్‌చెరువులోని 2 వేర్వేరు ప్రాంతాల్లో నిల్వ చేసిన 760 టన్నుల ఇసుకను స్వాధీనపర్చుకుని వీఆర్వోకు అప్పగించినట్టు మైనింగ్ శాఖ సాంకేతిక సిబ్బంది శైలజ తెలిపారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు ఇసుక నిల్వలు స్వాధీనపర్చుకున్నామన్నారు. తాను గృహనిర్మాణాలు చేసే కాంట్రాక్టర్‌నని, ఇక్కడ ఖాళీస్థలాలు ఉండడంతో గృహనిర్మాణ పనుల నిమిత్తం ఇసుకను ఇక్కడ నిల్వచేసుకున్నానని పి.వెంకటేశ్వరరావు అధికారులను కలసి వివరించాడు. వీటికి సంబంధించిన బిల్లులను తీసుకుని సోమవారం తమ కార్యాలయంలో హాజరుకావాలని శైలజ తెలిపారు. దాడుల్లో రవాణాశాఖ నుంచి గిరి, మైనింగ్ శాఖ సాంకేతిక సిబ్బంది మనీషా, దివాన్ చెరువు వీఆర్వో డి.రామజోగి కుడా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు

రెండు గంటలైనా ఆసుపత్రికి రాని వైద్యులు

ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే



తీవ్రగాయాల పాలైన యువకులు

రాజవొమ్మంగి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం దూసరపాము శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రగాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దూసరపాము శివారులో ద్విచక్ర వాహనానికి గెదే అడ్డు రావడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న రాజవొమ్మంగి గ్రామానికి చెందిన గొల్లపల్లి శ్రీనివాసు, సోముల వంశీ, అనంతగిరి గ్రామానికి చెందిన దూరిపల్లి వివేక్ వర్ధన్ తీవ్ర గాయాలపాలయ్యారు. శ్రీనివాసు, వివేక్‌కు ఎడమ కాళ్లు విరిగినట్టు వైద్య సిబ్బంది ప్రాథమికంగా గుర్తించారు. ప్రమాదం తరువాత అరగంట ప్రధాన రహదారిపైనే యువకులు గగ్గోలుపెట్టారు. అనంతరం రాజవొమ్మంగి ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు లేకపోవడంతో స్టాఫ్ నర్సులే క్షతగాత్రులకు ప్రాథమిక వైద్యం అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించేందుకు అంబులెన్స్‌లు అందుబాటులో లేకపోవడంతో సుమారు 2 గంటలపాటు క్షతగాత్రులు రోదించారు. యువకులను కాకినాడ, రాజమహేంద్రవరం ఆసుపత్రులకు వైద్య సిబ్బంది రిఫర్ చేశారు. 2 గంటలైనా వైద్యులు అందుబాటులో లేకపోవడం తెలుసుకున్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆగ్రహం వ్యక్తం చేశా రు. వైద్యులు ఆసుపత్రిలో లేకపోవడమే కాకుండా మండలంలోనే నివాసం ఉండట్లేదని తెలిసి ఘటనపైఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.


లారీ ఢీకొని వృద్ధ దంపతులకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడ్డ వృద్ధ దంపతులు

అమలాపురం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కామనగరువు బైపాస్ రోడ్డులో మోటారు సైకిల్‌పై వస్తున్న వృద్ధ దంపతులను లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి శివారు వాడపర్రుకు చెందిన వృద్ధ దంపతులు ముసమళ్ల దొరయ్య (67), మాణిక్యాంబ (61) వైద్య పరీక్షల కోసం మోటారుసైకిల్‌పై శనివారం అమలాపురం బయలుదేరారు. బైపాస్‌రోడ్డు జంక్షన్ దాటుతుండగా చెన్నై నుంచి కోల్‌కతా వైపు వెళుతున్న లారీ వేగంగా వచ్చి మోటారుసైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో దొరయ్య తలకు తీవ్ర గాయమైంది. మాణిక్యాంబ సైతం తీవ్రంగా గాయపడి తొలుత స్థానిక ఆసుపత్రిలో చేరారు. వైద్యుల సూచనలతో కాకినాడ ఆసుపత్రికి హుటాహుటీన తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖర్‌బాబు చెప్పారు.

రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు వేళంగి విద్యార్థి



హరీష్

కరప, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థి డి.హరీష్ రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఆర్.త్రిమూర్తులు తెలి పారు. గత నెల 21 నుంచి 30 వరకు ఏలూరులోని సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్లో జరిగిన టీఎస్‌సీ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ లాంచింగ్ క్యాంప్‌లో హరీష్ ప్రతిభ కనబరిచి ఫైరింగ్ విభాగంలో కాకినాడ ఎన్‌సీసీ గ్రూపు నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హరీష్‌ను హెచ్ఎం, పీఎంసీ ఛైర్‌పర్సన్ ఎస్.వెంకటలక్ష్మి, సర్పంచ్ నీలిమారాజేష్, పాఠశాల అభివృద్ధి కమిటీసభ్యుడు వీరయ్యచౌదరి అభినందించారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

తుని రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వేస్టేషన్ శివారు 1వ నెంబరు ప్లాట్‌ఫారంపై రైలు నుంచి జారి పడి సుమారు 45 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. వ్యక్తి నీలం రంగు చొక్కా, తెలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడని సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను, 94906 19020 నెంబర్లో కానీ సంప్రదించాలని కోరారు.

రైల్వేస్టేషన్ల మధ్యలో..



కొవ్వూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్ఐ ప.అప్పారావు తెలిపారు. రైల్వే పోలీసులు అందించిన వివరాల ప్రకారం... శనివారం ఉదయం పశివేదల, కొవ్వూరు రైల్వేస్టేషన్ల మధ్యలో కొవ్వూరు యార్డు వద్ద సుమారు 40 ఏళ్ల వ్యక్తి గాయాలపాలై మృతి చెందినట్టు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతదేహంపై నలుపురంగు కట్ డ్రాయర్, బిస్కెట్ కలర్ షర్ట్, నలుపురంగు పారగాన్ చెప్పులు ఉన్నాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు జీఆర్పీ ఎస్ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 9490617090, 99480 10061లో సమాచారం అందించాలన్నారు.

పంటకాల్వలో పడి చేనేత కార్మికుడు మృతి



సత్యనారాయణ(ఫైల్)

ముమ్మిడివరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుడు ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన ఉన్న పంటకాల్వలో పడి మృతిచెందాడు. కోనసీమ జిల్లా ముమ్మిడివరం కాశివానితూము సెంటర్ వీవర్స్ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు బొడ్డు సత్యనారాయణ (79) శనివారం తెల్లవారుజామున ఇంటి నుంచి టీ తాగుందుకు బైపాస్ రోడ్డుకు వెళ్లగా ఆ రోడ్డు పక్కన ఉన్న రాణేలంక పంటకాల్వలో అదుపుతప్పి పడి మృతిచెందాడు. అతడి సోదరుడు ప్రభాకరరావు ఫిర్యాదు చేయగా ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి సత్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సత్యనారాయణ ముమ్మిడివరం చేనేత పారిశ్రామిక ఉత్పత్తి విక్రయ కేంద్రంలో సభ్యుడిగా కొనసాగుతున్నాడు.

తునిలో అగ్నిప్రమాదం

తుని రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని వీరవరపుపేటలో ఓ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి ధారా కృష్ణవేణి షాపులో కిరాణా సామగ్రి ఆహుతయ్యాయి. అగ్ని మాపక సిబ్బంది మంటల్ని అదుపులోకి తీసుకొచ్చారు.

చెస్ చాంపియన్‌షిప్ విజేతగా అక్షయ

అమలాపురం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం మండలం సవరప్పాలెనికి చెందిన సత్తి అక్షయ జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. కర్ణాటకలో నిర్వహించిన ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌ను అక్షయ గెలుపొందినట్టు ఆమె తాతయ్య ప్రసాద్ తెలిపారు. ప్రసాద్ కుమారుడైన విజయ్‌రవిచంద్ర ప్రస్తుతం ఉత్తర, కన్నడ జిల్లాలో ఉన్న కైగా అణు విద్యుత్ కేంద్రంలో ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. అక్కడే పదో తరగతి చదువుతున్న అక్షయ కర్ణాటక ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ సాధించడంతో గ్రామస్తులు హర్షాతిరేకాలు చేశారు.



విజేతగా మెమెంటో అందుకుంటున్న అక్షయ

హత్య కేసులో ఇద్దరు నిందితులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పి.వేమవరానికి చెందిన కిరణ్ కార్తీక్ హత్య కేసులో అదే గ్రామానికి చెందిన నులకతట్టి కృష్ణప్రసాద్, దుల్లపల్లి వినోద్‌ను అరెస్ట్ చేసి కోర్టు ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు సామర్లకోట పోలీసులు శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా యువకుడు మిస్సింగ్ పేరిట కేసు నమోదు చేయగా దర్యాప్తు అనంతరం హత్యగా నిర్ధారించబడడంతో హత్యకేసుగా మలిచినట్లు సీఐ కృష్ణభగవాన్ వెల్లడించారు. నిందితులు తామే ఈ హత్య చేసినట్టు అంగీకరించారని, దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్టు

ఐ.పోలవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల పుష్కరఘాట్ వద్ద పోలీసులు శనివారం 9 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నలుగురు యువకులను అరెస్టు చేశారు. పుష్కరఘాట్ వద్ద నలుగురు యువకులు గంజాయితో ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 9 కిలోల గంజాయి లభించింది. దీనికి సంబంధించి నలుగురు యువకులను అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిలో ముగ్గురు పాతనేరస్తులుగా గుర్తించారు. ఈ కేసులో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్టు, అతడి కోసం గాలిస్తున్నట్టు ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.66.31 లక్షలు



హైకోర్టు జడ్జి దంపతులకు చిత్రపటం అందజేస్తున్న ఈవో

ఆత్రేయపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి క్షేత్రం శనివారం భక్తులతో పులకించింది. భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రూ.66.31 లక్షల ఆదాయం లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. స్వామివారిని హైకోర్టు జడ్జి వి.వెంకటజ్యోతిర్మయి మహిమ-శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. వారిని వేదపండితులు ఆశీర్వదించగా ఈవో స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

రేపు విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం

కడియం, జూలై 5(ఆంధ్రజ్యోతి): సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం వేమగిరి సబ్‌స్టేషన్‌లోని జేగురుపాడు ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు దీనివలన జేగురుపాడు గ్రామానికి విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్, రాజమహేంద్రవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఆపరేషన్) జేపీ బి.నటరాజన్ ఓ ప్రకటనలో తెలిపారు.



సుపరిపాలన తొలి అడుగులో ప్రజల అభిప్రాయాలను టీడీపీ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్, ధవళేశ్వరంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న గోరంట్ల రవిరామ్‌కిరణ్

పేదలకు రెండు సెంట్లు భూమిస్తాం

● నాల్గవ రోజు సుపరిపాలన తొలి అడుగులో ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరంసిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రజలకు చట్టబద్ధతలేని పట్టాలు ఇచ్చి మోసం చేసిందని కూటమి ప్రభుత్వం మాత్రం అర్హులైన పేదలకు రెండుసెంట్ల భూమిని చట్టబద్ధంగా ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తుందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం శనివారం స్థానిక 6వ డివిజన్‌లో ఇంచార్జి మజ్జి మణికంఠ, 31వ డివిజన్‌లో ఇంచార్జి చింతా జోగి నాయుడు, మహిళా నాయకురాలు మాలే విజయలక్ష్మి పర్యవేక్షణలో జరిగింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్‌సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, టీడీపీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబులతో కలిసి ఇంటి ంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పోలాకి పరమేష్, కిలపర్తి నాగభూషణం, నందిగాని మురళీకృష్ణ, మీసాల నాగమణి,శనపత్తి సత్తిబాబు, వీరా రాము, పైలా రాంబాబు, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు..

ధవళేశ్వరం: కూటమి పాలన మొదలై సంవత్సరం పూర్తయినందున ప్రభుత్వంచేసిన, చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం ధవళేశ్వరంలోని మసీదువీధి, రథం వీధి, తదితర ప్రాంతాల్లో టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగం ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్‌కిరణ్ కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశా రు. స్థానిక సమస్యలను తెలుసుకుని ఎమ్మెల్యే గోరంట్ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు పండూరి అప్పారావు, రూరల్ మండలపార్టీ అధ్యక్షుడు మచ్చేటి శివప్రసాద్, పుక్కెళ్ళరాజు, బత్తిన ఏడుకొండలు, షేక్ మహమ్మద్, కొత్తూరు దుర్గారావు, అడపా శ్రీను, నందిగం సత్యనారాయణ, ముచ్చి నాని, కర్రి సత్యనారాయణ, అల్లా రామస్వామి, రమేష్, దొడ్డి బాబ్జి, సాగర్ పాల్గొన్నారు.

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి

రాజానగరం: రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమందిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడానికి సీఎం చంద్రబాబు నిరంతం శ్రమిస్తున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జ్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. సుపరిపానలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలో కొత్తతుంగపాడు, తోకాడ, ఫరిజల్లిపేట గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికి తిరిగి ఏడాది పాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలు గురించి ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగంగిశెట్టి చంటిబాబు, నాయకులు మద్దిరెడ్డి చినవెంకటేశ్వరరావు, దొడ్డా వీరన్న, మల్లారపు సత్యానందం, చిట్టిప్రోలు పద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన

కడియం: ప్రధాని మోదీ ఆశయాల మేరకు రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సుపరిపాలన అందిస్తున్నారని, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషిచేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తెలిపారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు శనివారం కడియపుసావరం గ్రామంలో నరమామిడి దుర్గకు వైద్య ఖర్చులు నిమిత్తం రూ.లక్ష సీఎంసహాయనిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, బీజేపీ రూరల్‌కన్వీనర్ ఆకుల శ్రీధర్, మండల అధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు వరగోగుల వెంకటేశ్వరరావు, వరగోగుల రుద్రయ్య, రావిపాటి రామకృష్ణ, వరగోగుల సత్యనారాయణ, చిలుకూరి నాగేశ్వరరావు, చిక్కాల శ్రీను, గందం గోవిందు, చెన్నా రాము, కొటికల పూడి వెంకటేశ్వరరావు, పెనుమాక శేషగిరి, నాగులపల్లి వీరబాబు, గుత్తుల హరిప్రసాద్, దాసరి ముత్యం తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

బిక్కవోలు: రాష్ట్రంలోని ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమంతోపాటు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బిక్కవోలు మండలం కాపవరం, బిక్కవోలు, ఊలపల్లి, ఆరికరేవుల గ్రామాల్లో రూ.3.89కోట్లతో నిర్మించే వాటర్ ట్యాంకులు, సీసీ రోడ్లకు శనివారం ఆయన భూమిపూజలుచేసి పనులు ప్రారంభించారు. ఈయేడాది నియోజకవర్గంలో రూ.160కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, సంక్షేమానికొస్తే రూ.314 కోట్లతో కార్యక్రమాలు అమలుచేశామన్నారు. ఇక రైల్వేశాఖ ద్వారా రూ.252కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరయ్యాయని, ఇందులో బిక్కవోలు రైల్వేస్టేషన్‌ను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. బిక్కవోలు లేఅవుట్‌లో వాటర్ ట్యాంక్ పనులకు భూమిపూజ చేసిన ఆయనను గ్రామస్థులు తమ కాలనీలో రోడ్లు నిర్మించాలని కోరగా అందుకు ఆయన ఆరునెలల్లో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా కూటమి నేతలు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్‌లు సరెళ్ల సుమలత, రెడ్డి నాగవేణికుమారి, కూటమి నేతలు రావాడ నాగు, పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, పడాల చినబుజ్జి, ఇందల వీరబాబు, బేరా వేణమ్మ, ఓవి.కృష్ణ, తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, చెల్లే జోష్‌బాబు, తనుకు శ్రీధర్, డీఈఈ అచ్యుతరామారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్‌ఐ రవిచంద్రకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి పాలనతోనే సాధ్యం

అనపర్తి: అభివృద్ధి, సంక్షేమం ఏకకాలంలో అందించడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని దీనిని ఏడాది పాలనలోనే ప్రజలు తెలుసుకున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కూటమి ప్రభు త్వం ఏర్పడిఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలనతో తొలిఅడుగు కార్యక్రమాన్ని శనివారం అనపర్తి మండలం రామవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ఏడాదికాలంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాల వివరాలతో కూడిన కరపత్రాలను అందించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తుందన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, దత్తుడు శ్రీను, రావాడ నాగు, కర్రి శేషారత్నం, తేనెల శ్రీనివాస్, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, చింతా సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రామవరంలో ఇంటింటికీ వెళ్లి ప్రగతిని వివరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,మనోజ్‌రెడ్డి



తుంగపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న బీజేపీ, కూటమి నాయకులు

బాలసదనంలో ప్రత్యేక మెడికల్ క్యాంపు

రాజమహేంద్రవరంఅర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని బాల సదనం పిల్లలకు శనివారం జిల్లా సత్వర చికిత్సా కేంద్రం (డీఈఐసీ) సిబ్బంది ప్రత్యేక మెడికల్ క్యాంపు నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశాలమేరకు మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా ఈ మెడికల్ క్యాపు నిర్వహించామని జిల్లా ప్రోగ్రాం అధికారి ఆర్‌బీఎస్‌కే డాక్టర్ హరిశ్చంద్ర తెలిపారు. బాల సదనంలోని 19మంది బాల బాలికలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని, ఆరోగ్య సమస్యలున్న పిల్లలను తదుపరి చికిత్స కోసం రాజమహేంద్రవరంలోని డీఈఐసీ కేంద్రానికి రిఫర్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఇంద్రజ, దంత వైద్య నిపుణుడు డాక్టర్ విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

20న ఏపీ చదరంగం పోటీలు బ్రోచర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరంసిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్వామివివేకానంద 2వ రాష్ట్ర ఓపెన్ రాపిడ్ చందరంగం పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆవిష్కరించారు. శనివారం తిలక్‌రోడ్డులోని తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ చెస్ అనేది చాలా ప్రాచీన క్రీడ అని దీనికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ పోటీలు ఈనెల 20న దివాన్‌చెరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వేదికగా జరుగుతాయన్నారు. ఈ టోర్నమెంట్ ఆర్గనైజర్ హరిప్రసాద్ మాట్లాడుతూ శ్రీచెస్ 64 అకాడమీ ఆధ్వర్యంలో ఈస్ట్‌గోదావరి చెస్ అసోసియేషన్, ఆంధ్రా చెస్ అసోసియేషన్ సౌజన్యంతో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు జె.కరుణ్ దీప్, చలుమూరి శ్రీకాంత్, రాష్ట్ర చదరంగం సంఘం అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి జగదీష్, జిల్లా కార్యదర్శి జీవీ కుమార్, కళ్యాణ్‌కుమార్, నాగదిలీప్, కార్తీక్ గోపాల్, హేమచంద్రమౌళి పాల్గొన్నారు.

రజక ఆకాంక్ష సభకు తరలిరండి

● రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారాముడు

కోరుకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆదివారం రాజమహేంద్రవరం శ్రీ వెంకటేశ్వర ఆనం కళాక్షేత్రంలో జరుగుతున్న రజక ఆకాంక్ష సభకు జిల్లాలోని రజకులంతా తరలిరావాలని రాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షుడు మాతాసీతారాముడు పిలుపునిచ్చారు. ఈ సభకు రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీ సావిత్రి, రాష్ట్రరజక నాయకులు రాజమహేంద్రవరం నియోజకవర్గానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్యఅతిథులుగా పాల్గొంటున్నారన్నారు. అదే విధంగా రాష్ట్రంలోని రజక నాయకులు, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు, వివిధ ప్రాంతాలకు చెందిన రజకులు పాల్గొంటున్నారన్నారు. జిల్లా రజక సంఘం నాయకురాళ్ళు సర్పంచ్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వచ్చే నాలుగేళ్లలో ప్రతి ఒక్కరికి ఇల్లు

● ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): వచ్చే రెండేళ్లలో రాజానగరం నియోజకవర్గంలో అర్హులైన అందరికీ ఇంటి స్థలం కేటాయించడం తదుపరి రెండేళ్లలో ఇంటి నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. అర్హులైన వారందరికీ గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లస్థలాల కోసం సుమారు లక్షమంది దరఖాస్తు చేసుకున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వీరందరికీ స్థలాలు కేటాయిస్తామన్నారు.

కుతుకులూరులో పేకాట శిబిరంపై దాడి

● ఆరుగురు అరెస్టు

● రూ. 42 వేలు స్వాధీనం

అనపర్తి, జూలై 5(ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం కుతుకులూరులో శనివారం రాత్రి పేకాట శిబిరంపై అనపర్తి పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం కుతుకులూరు శివారులో పేకాట జరుగుతుందన్న సమాచారంలో దాడులు నిర్వహించామని అన్నారు. ఈ దాడిలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.42,420స్వాధీనం చేసుకున్నామని, వీరిని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.

పోస్టాఫీసు సేవలపై అవగాహన

సీతానగరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసు సేవలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని వెదుళ్ళపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 6వ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ప్రసార మాధ్యమాలు అనే అంశం వివరణలో భాగంగా పోస్టాఫీస్ నుంచి పొందే సేవలపై విద్యార్థులు స్వయంగా పోస్టుకార్డులో ప్రభుత్వం నుంచి విద్యార్థులకు అందుతున్న ప్రయోజనాలను బుక్స్, యూనిఫామ్, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలను కొనియాడుతూ ఎంఈవో, ఎంపీడీవోలకు పోస్టుకార్డులతో కృతజ్ఞతలు తెలుపుతూ కార్డులను పోస్టు డబ్బాలో వేశారు.



పోస్టుకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే బత్తుల



కోరుకొండలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శనివారం ఉదయం 10గంటల నుంచి కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ఈసందర్భంగా పలు గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలకు సంబంధించిన అర్జీలు అందజేశారు. మరికొన్ని గ్రామాల ప్రజలను ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కోరుకొండ మండల జనసేన నాయకులు, అడ్డాల శివ,ముక్కా రాంబాబు, నాతిపాము దొరబాబు, బదిరెడ్డిదొర, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోనేరు మురళీని పరామర్శించిన నాయకులు



కోనేరు సుష్మంత్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్

రాజమహేంద్రవరంసిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): పుత్రవియోగంతో బాధపడుతున్న నగర ప్రముఖుడు, టీడీపీ నేత కోనేరు మురళిని పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పరామర్శించారు. శనివారం ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు అశోక్‌కుమార్‌జైన్, గోపాలపురం మండలం టీడీపీ అధ్యక్షుడు గద్దే హరిబాబు, చిట్యాల సర్పంచ్ నూతంగి దొరబాబు, రాజమండ్రి ఆటో యూనియన్ సభ్యులు నగరంలోని కోనేరు మురళి నివాసానికి చేరుకుని పరామర్శించారు. సుష్మంత్ వెంకట్ చిత్రపటానికి నివాళు లర్పించి తమ ప్రగాడ సంతాపం తెలిపారు.

ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగాలి

● జిల్లా పంచాయతీ అధికారి శాంతకుమారి

కడియం, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ చెత్త సేకరణ సక్రమంగా జరపడానికి కృషిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి శాంతకుమారి సూచించా రు. వేమగిరి, కడియపుసావరం, మాధవరాయుడుపాలెం గ్రామాల్లో పర్యటించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేందుకు ఇంటి యజమానులు సహకరించాలని పలువురిని ఇళ్లకు వెళ్లి వారికి అవ గాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులు చెత్తసేకరణ ఏవిధంగా చేపడుతున్నారు? అనే అంశంపై ఆరా తీశారు. చెత్త సేకరణ సక్రమంగా జరగకపోతే సంబంధిత ఉద్యోగులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని డీపీవో శాంతకుమారి హెచ్చరించారు. డిప్యూటీ ఎంపీడీవో అయినవిల్లి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేత



స్కాలర్ షిప్స్ అందుకున్న పేద విద్యార్థులతో వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ క్లబ్ సభ్యులు

రాజమహేంద్రవరంసిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): చదువులలో రాణిస్తున్న ప్రతిభగల పేద విద్యార్థులు 30మందికి రూ.3లక్షల 10వేలు ఉపకార వేతనాలను వాకర్స్‌యోగా అండ్ లా ఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవాసంస్థ అందించింది. శనివారం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆనంద గార్డెన్స్‌లో క్లబ్ అధ్యక్షుడు శనపత్తి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జ్ఞానసరస్వతి పీఠం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వైస్‌చైర్మన్ చలుమూరి శ్రీనివాస్, కాంట్రాక్టర్ తమనంపూడి రామిరెడ్డి, చల్లా శివ, డాక్టర్ కంటే వీరన్నచౌదరి రమణిలు హాజరయ్యారు. ఈసందర్భంగా వారి చేతులమీదుగా పది, ఇంటర్, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, డిగ్రీ, చదువుతున్న ప్రతిభగల పేద విద్యార్థులకు క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు ఆధ్వర్యంలో రూ.6నుంచి రూ.12వేల వరకు ఉపకార వేతనాలను దాతలు అందించారు. ఈసందర్భంగా క్లబ్ కార్యదర్శి గుబ్బల గంగాభవాని గత 14ఏళ్లుగా క్లబ్ నిర్విరామంగా విద్యార్థులకు ఉపకారవేతనాలు అందిస్తుందని వివరించారు. క్లబ్ సేవలను అతిథులు ప్రసంశించారు. తొలుత సంఘ సంస్కర్త వీరేశలింగం పంతులు రాజ్యలక్ష్మి దంపతులు చిత్రపటానికి, విద్యార్థులకు ఆర్థికసాయం చేసిన దివంగత పొలసానపల్లి జగ్గారావు చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం 80మంది వృద్ధులకు రూ.500 చొప్పున రూ.40వేలు పించన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా దాతలను సత్కరించారు. క్లబ్ సభ్యులు చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి, ఎ.శ్రీనివాస్, కాశీవిశ్వేనాథం, పి.సాయిసూర్యప్రకాష్, భేరి రత్నాంబ, మొగల్తూరు దుర్గ, లంకే శ్రీదేవి, బి.సత్తిబాబు, గీసాల బాపూజీ, శీలం రామకృష్ణ పాల్గొన్నారు.

విశ్రాంత ఏఈవోల సమస్యల పరిష్కారానికి కృషి

ఏఈవోల సంఘం నేత వేణుమాధవరావు



సమావేశమైన విశ్రాంత ఏఈవోల సంఘం

రాజమహేంద్రవరంరూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విశ్రాంత వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యల పరిష్కారానికి ఏఈవో సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి. వేణుమాధవరావు అన్నారు. రాజమహేంద్రవరం ధర్మంచర కమ్యూనిటీ హాలులో శనివారం జరిగిన విశ్రాంత వ్యవసాయ విస్తరణ అధికారుల రాష్ట్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంత వ్యవసాయ విస్తరణ అధికారుల వైద్యబిల్లులు, ఇంకా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. గతంలో పనిచేసిన ఏఈవోల సంఘం నాయకులు చేసిన కృషి వల్లనే ప్రస్తుత ఏఈవోలు ప్రయోజనాలు పొందుతున్నారన్నారు. అనంతరం విశ్రాంత వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా ఎస్.పాపినాయుడు, రాష్ట్ర అధ్యక్షుడిగా టి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా జి.మార్టిన్ శాంతకుమార్, సహాధ్యక్షుడిగా ప్రగడ సంజీవరావు, ఉపాధ్యక్షుడిగా జి.సింహచలం, బి.సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సి.ఓంకారయ్య, సంయుక్త కార్యదర్శులుగా ఎస్వీ.శ్రీనివాస్, వి.నాగసత్యశ్రీనివాస్‌లు, కోశాధికారిగా కె.నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా కె.ఫ్రాన్సిస్, డి.సత్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేజీకే మూర్తి, నగర ఎన్జీవో సంఘం ఉపాధ్యక్షుడు మీసాల మాధవరావు, ఉమ్మడిజిల్లా ఏఈవో సంఘం కార్యదర్శి సతీష్, కోశాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో నేరాల నియంత్రణ

● పలు గ్రామాల్లో పోలీసుల అవగాహన

రాజానగరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సమిష్టి కృషితో నేరాలను అదుపుచేయవచ్చని రాజానగరం సీఐ ఎస్.ప్రసన్నవీరయ్య గౌడ్ పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో సీఐ తమ సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో మండలంలో కొన్ని ప్రాంతాల్లో తరచూ జరుగుతున్న వరుస దొంగతనాలు నేపథ్యంలో పోలీసుల మూగనోము శీర్షికన ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంతో జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు రాజానగరం పోలీసులు ఎట్టకేలకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలోని చక్రద్వార బంధం తోపాటు పరిసర గ్రామాలైన వెలుగుబంద, పరిజల్లిపేట తదితర గ్రామాల్లో పాడి పశువులు దొంగతనాలు నిర్మూలనలో ప్రజలు కూడా సహకారం అందించాలని కోరుతున్నారు. హైవేపై ఆదికవి నన్నయ యూనివర్శిటీ, గైట్ ఇంజనీరింగ్ కళాశాల, సూర్యారావుపేట దుర్గమ్మగుడి కూడళ్లలో తరచూ అనేక మంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.

విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

● అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ట్రాఫిక్ సీఐ అబ్దుల్ నబీ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ట్రాఫిక్‌పరంగా ఉన్న చట్టాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కల్గి ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం, కళాశాల తెలుగుశాఖ అధిపతి పీవీబీ సంజీవరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు తొలి ఏకాదశి పూజులు

దివాన్‌చెరువు, జూలై4 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని రాజుగారి లేఅవుట్‌లో ఉన్న శ్రీదేవీ, భూదేవీ గోదా ఆండాళ్‌సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారికి తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా విశేష పూజలు జరుగుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు కె.రాధాకృష్ణమాచార్యులు తెలిపారు.

22ఏలో చేరిన భూములకు విముక్తి

● ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి జూలై 5 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న 22ఏ సమస్య నుంచి రైతులకు విముక్తి కలిగించినట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం రామవరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రైతులకు చెందిన అనేక భూములను ప్రభుత్వ భూముల జాబితా 22ఏ లో పెట్టారని దీంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇటువంటి రైతుల జాబితాను తయా రుచేసి వీరి భూములను 22ఏ నుంచి విముక్తి కలిగించామన్నారు. మండలంలో 200 మంది రైతులకు లబ్ధి చేకూరిందని అన్నారు. అనపర్తిలో 52మంది, మహేంద్రవాడలో నలుగురు, రామవరంలో 72 మంది, పెడపర్తిలో 42 మంది, పులగుర్తలో 30 మంది రైతులకు చెందిన 24.85 ఎకరాల భూమికి విముక్తి కలిగిందని అన్నారు. తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి కూటమి నాయకులు పాల్గొన్నారు.

మలబార్‌లో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జ్యూవలరీ షో



మలబార్ షోరూంలో మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరంకల్చరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద గల మలబార్‌గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో ప్రత్యేకంగా తయారుచేసిన ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శనను శనివారం సాయంత్రం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ ఆర్టిస్ట్రీ బ్రాండ్ ఆభరణాలు అద్వితీయమైన కళానైపుణ్యతతో తయారు చేశారని, కళాత్మకంగా నిలుస్తాయని షోరూం మేనేజర్ వెంకట్ తెలిపారు. ఈఆభరణాల ప్రదర్శన ఈనెల 5నుంచి 13 వరకు జరుగుతుందని తెలియజేశారు.





శ్యామలాంబ బోనాల ఉత్సవం

కొత్తపేటలోని శ్యామలాంబ అమ్మ వారి ఆలయం వద్ద జరిగిన బోనాల మహోత్సవం శనివారం సాయంత్రం వేడుకగా జరిగింది. అమ్మవారికి అభిషేకం చేసేందుకు మహి ళలు ఊరేగింపుగా వెళ్లి పుష్కరాలరేవు నుంచి గోదావరి జలాలు తెచ్చారు. ఆ జలాలతో అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకం చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



ప్రతి శనివారం హౌసింగ్ డే : జేసీ

కొవ్వూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని జేసీ ఎస్.చిన్నరాముడు అన్నారు. కొవ్వూరులోని స్పెక్ లేఅవుట్‌ను శనివారం ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు. హౌసింగ్ డేను పురస్కరించుకుని ప్రతి శనివారం గృహ నిర్మాణ కాలనీలు పర్యవేక్షిస్తామన్నారు.కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ శేఖర్‌బాబు, ఏఈ చక్రవర్తి, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మునిసిపల్ ఏఈలు సుమంత్,ఆర్‌ఐ డి.శ్యామ్ పాల్గొన్నారు.

మహిళా..! ఉచిత బస్..

వచ్చేస్తోంది..!



మహిళలకు శుభవార్త.. సీఎం చంద్రబాబునాయుడు ఒక్కొక్కటిగా హామీలు నెరవేరుస్తున్నారు.. మరో హామీ నెరవేర్చనున్నారు.. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం హామీ అమలుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ కానుకగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం సౌకర్యం కల్పిస్తామని సీఎం వెల్లడించారు. ఆ దిశగా తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో బస్‌లు సిద్ధం చేస్తున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మహిళలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15.. స్వాతంత్ర్య దినోత్సవం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఈ పథకం ఢిల్లీ, తెలంగాణ, కర్నాటకల్లో అమలవుతోంది. ఎన్నికలకు ముందు సీఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' ప్రధానమైన వాగ్దానం. పథకం ప్రారంభించిన తర్వాత ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకూడదనే ఉద్దేశంతో ఆ రాష్ట్రాల్లో ఇప్పటికే అధ్యయనం చేయించి ఒక అంచనాకు వచ్చారు. విధివిధానాలను ఖరారు చేసే పనిలో ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ పథకం అమలు దాదాపు చివరి అంకంలో ఉంది. ఈ మేరకు అవసరమైన బస్సులను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేస్తున్నారు.

బస్‌లకు మరమ్మతులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రి, నిడదవోలు, కొవ్వూరు, కాకినాడ, తుని, ఏలేశ్వరం, అమలాపురం, రాజోలు, రామచంద్రాపురం, రావులపాలెం డిపోల్లోని పల్లె వెలుగు బస్సులను పూర్తిగా పరీక్షించి ఆ మేరకు మరమ్మతులు చేస్తున్నారు. పథకం ప్రారంభించిన తర్వాత బస్సుల సీటింగ్ కెపాసిటీకి మించి రద్దీగా ప్రయాణికులు ఉండే అవకాశం ఉంది. ఈమేరకు కొన్ని డిపోలకు కొత్తగా సూపర్ లగ్జరీ బస్సులు ఇచ్చారు. బాగా పాతబడిన వాటి బాడీలను పల్లెవెలుగు బస్సులతో మార్పుచేస్తున్నారు. గణాంకాలు పరిశీలిస్తే మొత్తం ఒక రోజులో ప్రయాణించే వాళ్లలో పల్లె వెలుగు బస్సుల్లో 50 శాతం రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్పు పనులను ఆయా జిల్లాల జిల్లా ప్రజా రవాణా అధికారులు (డీపీటీవోలు) ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తున్నారు. ఈడీ విజయరత్నం ప్రతిరోజూ సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాకు ఉచితమట!

ఉచిత ప్రయాణం ఉమ్మడి జిల్లా ప్రాతిపాదికన కల్పిస్తారనే చర్చ నడుస్తోంది. అంటే తూర్పుగోదావరి జిల్లా మహిళలు కోనసీమ, కాకినాడ జిల్లాల వరకూ ప్రయాణించవచ్చు. వారికి జీరో టికెట్ ఇస్తారు. దీనిలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఉదాహరణకు కొవ్వూరు ఉమ్మడి పశ్చిమ గోదావరి పరిధిలోకి వస్తుంది. కానీ కొత్త జిల్లాల విభజనలో తూర్పులో కలిసింది. ఇప్పుడు ఉమ్మడి జిల్లాల పరిధి అమలు చేస్తే ఏలూరు నుంచి కొవ్వూరు వరకూ ఉచితంగా వచ్చేసి, అక్కడి నుంచి రాజమండ్రికి టికెట్ కొనుక్కోవాల్సి రావచ్చు. ఇంకో ఐదు కిలోమీటర్లే కదా అని టికెట్ తీసుకోని వారి సంఖ్యా ఉంటుంది. వీళ్లను గుర్తించడం కష్టంగా మారొచ్చు. ఆర్టీసీ ఆవిధంగానూ ఆదాయం కోల్పోయే అవకాశం లేకపోలేదు. ఇక ఉచిత ప్రయాణం మొదలు పెట్టిన తొలి రోజుల్లో తెలంగాణ, కర్నాటక చాలా కష్టాలు ఎదుర్కొన్నాయి. ఆయా ఇబ్బందులను అధిగమించే దిశగా ఆలోచన చేస్తున్నారు. దీంతో త్వరలోనే ఉచిత బస్ ప్రయాణం అమల్లోకి రానుంది.

- ఆగస్టు 15 నుంచి అమలు
- రోజుకు రూ.30 లక్షల భారం
- ఆర్టీసీ డిపోల్లో చురుగ్గా పనులు
- ఉమ్మడి జిల్లా పరిధిలో ఉచితం?
- యుద్ధప్రాతిపదిక బస్సులు సిద్ధం
- 'పల్లె వెలుగు'లకు మెరుగులు
- మహిళల ఆనందం

ఉమ్మడి జిల్లాలో 532 బస్సులు



తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 285 బస్సులు ఉండగా 165 పల్లెవెలుగు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 291కి 191, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 300కి 176 పల్లెవెలుగులు ఉన్నాయి. అంటే ఉమ్మడి తూర్పుగోదావరిలో మొత్తం అన్ని రకాల బస్సులు కలిపి 876 ఉండగా, వాటిలో 532 పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు ఉన్నాయి. వీటన్నిటినీ యుద్ధప్రాతిపదికన సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం తూర్పుగోదావరిలో 89 వేలు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో 80 వేల చొప్పున కలుపుకొని రోజుకు సరాసరిన 2.50 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్టీసీలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగులో దాదాపు 50 శాతం మంది ప్రయాణిస్తున్నారు. మూడు జిల్లాల్లోని 11 ఆర్టీసీ డిపోల్లో రోజుకు రూ.1.20 కోట్ల ఆదాయం సమకూరుతోంది. వీటిలో పల్లె వెలుగు వాటా దాదాపు రూ.60లక్షల పైనే ఉంటుంది. మొత్తం ప్రయాణికుల్లో 50 శాతం మహిళల లెక్కన చూసినా రోజుకు రూ.30 లక్షల వరకూ ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది.

బస్‌లు మెరుగుపరుస్తున్నాం..



మహిళలు ప్రయాణించే బస్సులు కాబట్టి బయలుదేరిన తర్వాత ఎలాంటి సమస్యలూ ఉత్పన్నం కాకుండా మెరుగు పరుస్తున్నాం. యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి.ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సూచనలు చేస్తున్నారు. వాటికి తగినట్లుగా పనులు చేయిస్తున్నాం. ప్రభుత్వానికి చెడ్డ పేరు రానీయకుండా బస్సులు తిప్పుతాం.

- సత్యనారాయణ మూర్తి, డీపీటీవో,తూర్పుగోదావరి

కోట సత్తెమ్మకు రూ.27.77 లక్షల ఆదాయం



ఆలయంలో హుండీల సొమ్ము లెక్కిస్తున్న భక్తులు

నిడదవోలు, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయ హుండీలను శనివారం లెక్కించారు. దేవదాయ ధర్మా దాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సొమ్ము లెక్కించారు. మార్చి 27 నుంచి జూలై 4 వరకు సుమారు 100 రోజులకు ఆలయంలో హుండీల ద్వారా రూ.26,08,512ల ఆదాయం రాగా అన్నదాన హుండీ ద్వారా రూ.1,69,143లు మొత్తం రూ.27,77,655ల ఆదాయం లభించినట్టు దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు. బంగారం 0.26 గ్రాములు, వెండి 296 గ్రాములు లభించినట్టు తెలి పారు.హుండీ లెక్కిం పులో దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణాధికారి ఇవి సుబ్బారావు, ఆలయ ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ దేవులపల్లి రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణానికి రూ. కోటి విరాళం

సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి అందజేసిన పరమేశ్ బయోటెక్ ఎండీ



తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతికి రూ.కోటి చెక్‌ను ఎమ్మెల్యే మద్దిపాటి సమక్షంలో అందజేస్తున్న పరమేశ్ బయోటెక్ లిమిటెడ్ ఎండీ ఆనంద్‌స్వరూప్

గోపాలపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సామాజిక అవసరాలకు ప్రభుత్వంతో పాటు దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే మద్ది పాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో ఆసుపత్రి అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి పెట్టారు.దీనిలో భాగంగా దాతల సాయం కోసం ప్రయత్నించారు. పరమేశ్ బయోటెక్ లిమిటెడ్ ఎండీ ఆనంద్ స్వరూప్ ముందుకు వచ్చారు. ఈ మేరకు రాజమహేంద్రవరం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం కలెక్టర్ పి.ప్రశాంతికి సీఆర్ఎస్ ఫండ్స్ నుంచి ఆసుపత్రి ఉన్నతికి రూ.కోటి మంజూరు పత్రాన్ని ఎండీ ఆనంద్‌స్వరూప్, ఎమ్మెల్యే మద్దిపాటి అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రూ.కోటి విరాళంగా ఇవ్వడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు.

ట్రిపుల్ ఐటీ తొలి దశ అడ్మిషన్లు పూర్తి

నూజివీడు టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నూజివీడు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో తొలి దశ అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. జూన్ 30వ తేదీ నుంచి ప్రారంభమైన అడ్మిషన్లలో జూన్ 30, జూలై 1వ తేదీన ఆర్కే వ్యాలీ, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ అడ్మిషన్లకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించగా ఈ నెల రెండు, మూడు తేదీలలో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు, శుక్ర, శనివారాల్లో ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాం పస్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆర్జీయూకేటి రిజిస్ట్రార్ ఎస్. అమరేంద్రకుమార్, ఒంగోలు క్యాంపస్ డైరెక్టర్ భాస్కర్ పటేల్ పర్యవేక్షించారు.

పండుగలకు పిలుపు

నేడు తొలి ఏకాదశి

ఆలయాలు ముస్తాబు



ద్వారకాతిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసంలో వచ్చే మొదటి ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. ఇది తెలుగు ప్రజలకు పవిత్రమైన తొలి పండుగ. శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్లే ఈ రోజు నుంచి భక్తులలో ఆధ్యాత్మిక భావనలు ఉప్పొంగుతాయి. జిల్లాలోని అన్నివైష్ణవ ఆలయాలు ముస్తా బవుతున్నాయి. ప్రముఖ క్షేత్రమైన ద్వారకాతిరు మల శ్రీవారి ఆలయంలో తొలి ఏకాదశి నాడు స్వామికి పేల పిండిని నైవేద్యంగా పెడతారు. అనంతరం రాత్రి ఉభయదేవేరులతో స్వామి వారు క్షేత్ర పురవీధుల్లో భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పిస్తారు.

ఈరోజు నుంచే పండుగలు ప్రారంభం

అసలు ఈ ఏకాదశి నుంచే పండుగలన్నీ మొదలవుతాయి. అందువల్లే దీనిని తొలి పండుగ అని.. తొలి ఏకాదశి అని పిలుస్తారు. తొలి ఏకాదశిని శయన ఏకాదశి అని కూడా పిలుస్తుంటారు. ఈ రోజు నుంచి నాలుగు నెలల పాటు విష్ణుమూర్తి పాలకడలిపై శయనిస్తారట. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశుల కంటే ఆషాఢంలో వచ్చే తొలి ఏకాదశి ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. అందుకే ఈ రోజు ఉపవాసం ఉంటే ఆ విష్ణుమూర్తి అనుగ్రహం తప్పక లభిస్తుందని చెబుతారు. ఈ రోజు ఉదయం 5 నుంచి 9 గంటల వరకూ పూజకు శుభసమయం. తొలి ఏకాదశి నుంచి దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభమవుతోంది.

తొలి ఏకాదశి ఎప్పుడు జరుపుకోవాలి

ప్రతి ఏటా ఆషాఢ మాసం శుక్ల పక్ష ఏకాదశి తిథి రోజున తొలి ఏకాదశి జరుపుకుంటారు. ఈ సారి ఈ తిథి జూలై 6న వచ్చింది. హిందూ క్యాలెండర్ ప్రకారం ఏకాదశి తిది శనివారం సాయంత్రం 6.58 గంటలకు ప్రారంభమై ఆదివారం రాత్రి 9.14 గంటలకు ముగుస్తుంది. ఉపవాసం ఎల్లప్పుడూ ఉదయ తిధి రోజున పాటిస్తారు. కనుక ఈ తొలి ఏకాదశి ఉపవాసం ఆదివారం పాటించాల్సి ఉంటుంది.

ఉపవాసాలకు శుభసమయం

తొలి ఏకాదశి ఉపవాసం ద్వాదశి తిథిలో అంటే సోమవారం విరమించాల్సి ఉంటుంది. ఉపవాసం విరమించ డానికి శుభసమయం ఉదయం 5.29 నుంచి 8.16 వరకూ ఉంటుంది. ఈరోజు ద్వాదశి తిథి రాత్రి 11.10 గంటలకు ముగుస్తుంది. కనుక ఉదయం ఉపవాసం విరమించడానికి శుభప్రదం.

తొలి ఏకాదశి ప్రాముఖ్యత

ఈ ఏకాదశి రోజున యోగనిద్రలోకి వెళ్లే విష్ణువు కార్తీక మాసంలోని శుక్ల ఏకాదశి రోజున మేల్కొంటారని నమ్ముతారు. ఈ నాలుగు నెలలను చాతుర్మాసం అంటారు. ఈ సమయంలో సాధన, ఉపవాసం, ఆధ్యాత్మిక పనులు ఫలవంతమైనవిగా భావిస్తారు. అయితే వివాహం, గృహ ప్రవేశం వంటి శుభకార్యాలు నిషేధించబడ్డాయి. హిందూ మత విశ్వాసాల ప్రకారం దేవశయని ఏకాదశి రోజున ఉపవాశం వల్ల జీవితంలో ఆనందం, శాంతి, శ్రేయస్సు లభి స్తుంది. పాపాల నుంచి విముక్తి పొంది మోక్షం పొందుతాడని పురాణాలు ప్రవచిస్తున్నాయి. ఈ రోజున విష్ణు సహస్రనామ పారాయణ, లలిత సహస్రనామ పారాయణ, పేదలకు అన్న దానం, వస్త్రదానం వంటివి చేస్తే ఆ దేవదేవుని అనుగ్రహం లభిస్తుందని పండితులు చెబు తున్నారు. అంతేకాకుండా తొలి ఏకాదశి ఒక్కరోజు ఉపవాసం ఉంటే.. ఏడాదిలో వచ్చే 24 ఉపవాసాలు చేసినంత పుణ్యం వస్తుందని పండితులు వివరిస్తున్నారు.

తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి చొరవతో క్యాన్సర్ నుంచి బయటపడిన ఏలూరు మహిళ

హైదరాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో ఓ మహిళ క్యాన్సర్ బారి నుంచి బయటపడింది. దీంతో ఆమె భర్త శనివారం భట్టి విక్రమార్కను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరుకు చెందిన రామకృష్ణ హైదరాబాద్‌లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. ఆయన భార్య క్యాన్సర్‌తో బాధ పడుతుండడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. కొంత కాలం తర్వాత వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడడంతో గాంధీ భవన్‌లో జరిగిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో రామకృష్ణ కుమారుడు భట్టి విక్రమార్కను కలిసి పరిస్థితిని వివరించారు.దీంతో ఆయన స్పందించి వైద్య ఖర్చులకు సంబంధించి ప్రభుత్వం నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ)ను ఇప్పించారు. ఈ ఎల్‌ఓసీ భరోసాతో తన భార్యకు ఐదుసార్లు కీమో థెరపి చేయడంతో క్యాన్సర్ మహమ్మారి నుంచి పూర్తిగా బయట పడినట్లు వైద్యులు నిర్ధారించారని రామకృష్ణ భట్టికి వివరించారు.

'తల్లికి వందనం' రాలేదని విద్యుత్ పోల్ ఎక్కాడు..



భీమవరం క్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : తనకున్న ఇద్దరు బిడ్డలకు తల్లికి వందనం డబ్బులు అకౌంట్‌లో పడలేదంటూ ఒకవ్యక్తి శనివారం సాయంత్రం హల్‌చల్ చేశాడు. భీమవరం మెంటేవారి తోటలోని ఎల్‌అండ్‌టీ కాలనీకి చెందిన కోరుపల్లి శ్యామ్‌కు ఇద్దరు బిడ్డలు ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పథకాల్లో భాగంగా అతని అకౌంట్‌లో డబ్బులు పడలేదు. దీంతో మనస్థాపం చెంది శనివారం సాయంత్రం బైపాస్ రోడ్డులోని యనమదుర్రు డ్రెయిన్ వద్ద వంతెన సమీపంలో ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ పోల్ ఎక్కి హడావుడి చేశాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని అతనిని సముదాయించారు. తల్లికి వందనం డబ్బులు పడతాయని హామీ ఇస్తేనే కిందకు దిగుతానంటూ అరిచాడు. భార్య పిల్లలను అక్కడకు తీసుకువెళ్ళి మైక్ ద్వారా అతనిని కిందకు దిగమని కోరారు. చివరకు జిల్లా కలెక్టర్‌తో చెప్పి డబ్బులు పడేలా చేస్తామంటూ హామీ ఇవ్వడంతో కిందకు దిగి వచ్చాడు. పోలీసులు అతనిని స్టేషన్‌కు తీసుకు వెళ్ళి కౌన్సెలింగ్ ఇచ్చినట్లుగా సమాచారం.

ముక్కామలలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

పెరవలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కామలలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. టీడీపీ నేతలు అతికాల శ్రీను, నల్ల సురేంద్ర, బొడ్డు రామాంజనేయులు, అబ్బిశెట్టి సత్తిరాజు హాజరయ్యారు.

ఉండ్రాజవరం ఎస్ఐగా రవికుమార్

ఉండ్రాజవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం ఎస్ఐగా డీ. రవికుమార్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంగర పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు విశేషంగా కృషిచేస్తానని చెప్పారు. అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటానన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

• కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు • పలు గ్రామాల్లో 'సుపరిపాలనకు తొలి అడుగు'



సీతంపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం సీతంపేటలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ గత ఏడాది కాలంగా ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, సూరపనేని చిన్ని, వీరమళ్ల రామకృష్ణ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మార్కొండపాడులో ...

చాగల్లు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభి వృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మార్కొం డపాడులో జరిగిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకా లపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, టీడీపీ నాయకులు సుంకవల్లి రమేష్, బండి శ్రీను ఆలపాటి అచ్చెన్న చౌదరి, బొడ్డు కేశవ, బొల్లిన శివ నాగేంద్ర, అబ్బూరి సీతారాముడు, పత్తిపాటి శశాంక్, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లులో ...

చాగల్లులో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు ఆధ్వర్యంలో తొలి అడుగు కార్యక్ర మం జరిగింది. శివాలయం వీధిలో టీడీపీ నాయకులు పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కరపత్రా లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొంగ రామకృష్ణ, కేతా సాహెబ్, వీవీ వాసు, జొన్నకూటి వెంకాయమ్మ, డొక్కు పార్వతి, పాశం రామకృష్ణ, ఆల్తాఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

కరిచర్లగూడెంలో ...

గోపాలపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పిలుపుతో కరిచర్లగూడెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గ్రామ కమిటీ అధ్యక్షుడు పటాన్ మగ్బుల్ భాషా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. దీనికి హాజరైన మండల బీసీ సెల్ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ కార్యక్రమానికి మండలం నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. బూత్ ఇన్‌చార్జి పటాన్ రహీం, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు వడ్లపూడి సూర్య నారాయణ, గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి వేముల మంగరాజు, నేరుసు సురేశ్, తెల్లమల్ల రాజు పాల్గొన్నారు.

కోరుమామిడిలో..

నిడదవోలు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలనకు తొలి అడుగు పడిందని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. శనివారం కోరుమామిడిలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికీ టీడీపీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోరుమామిడిలో కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

పాలంగిలో..

ఉండ్రాజవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి):సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. శనివారం పాలంగిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, గ్రామటీడీపీ అధ్యక్షుడు ఈద్పుగంటి ఉదయకుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే వెలగదుర్రులోనూ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జయప్రసన్న కుటుంబ సభ్యులకు జవహర్ పరామర్శ

చాగల్లు, జులై 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో కెమికల్స్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన పోలిశెట్టి జయప్రసన్న కుటుంబ సభ్యులను ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మదర్ థెరీసా సేవాసమితి ద్వారా అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న పోలిశెట్టి శ్రీనివాసరావు కుటుంబానికి వచ్చిన కష్టం ఎవరూ తీర్చలేనిదన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి తగిన న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు. మన ప్రభుత్వంతో కూడ మాట్లాడి అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ వేగి చిన్నా, టీడీపీ నాయకులు కోడూరి ప్రసాద్, కొడవటి మెహర్ బాబా, మన్నే సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 213 కేసులు రాజీమార్గంలో పరిష్కారం



లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి అనురాధ

కొవ్వూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు కోర్టు సముదాయాల ప్రాంగణంలో శనివారం మండల న్యాయసేవా సంస్థల ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఇందులో 213 కేసులు రాజీమార్గంలో పరిష్కరించినట్టు పట్టణ 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ తెలిపారు. ఇందులో 4 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ప్రీ లిటికేసుల నిమిత్తం 1వ బెంచ్‌కు జడ్జి అనురాధ, న్యాయవాద సభ్యురాలిగా ఎం. నాగమణి, సివిల్ కేసుల పరిష్కారం నిమిత్తం 2వ బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, న్యాయవాద సభ్యుడిగా టి.ప్రభాకర్, సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారం నిమిత్తం 3వ బెంచ్‌కు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, న్యాయవాద సభ్యునిగా కె.వి.ఎస్.అరవింద్, సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారం నిమిత్తం 4వ బెంచ్‌కు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, న్యాయవాద సభ్యునిగా డి.ప్రకాష్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వర్రే నాగమురళీకృష్ణ, న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొవ్వూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్ఐ వీ. అప్పారావు తెలిపారు. రైల్వే పోలీసులు అందించిన వివరాలివి ... పశివేద, కొవ్వూరు రైల్వే స్టేషన్ల మధ్యలో కొవ్వూరుయార్డు వద్ద సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి మృతిచెందినట్టు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతుడి ఆచూకీ తెలిసినవారు 9490617090, 9948010061 నెంబర్లకు తెలపాలన్నారు.

కొవ్వూరు ఫైర్‌స్టేషన్‌కు పరికరాలు అందజేత

కొవ్వూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు సంభవించినప్పుడు ప్రాణాలకు తెగించి ప్రాణ, ఆస్తినష్టం నుం చి ప్రజలను కాపాడడంలో అగ్ని మాపక సిబ్బంది పాత్ర ప్రశంసనీయమని అవంతి సంస్థల డైరెక్టర్ అల్లూరి వెంకట సంజీవ్ అన్నారు. అవంతి ఫౌండేషన్ ట్రస్టీ అల్లూరి ఇంద్రకుమార్ సహకారంతో కొవ్వూరు ఫైర్ స్టేషన్ సిబ్బందికి రూ. 1,20,000 విలువైన అగ్ని ప్రమాదాల నివారణకు వినియోగించే పరికరాలను శనివారం పంపిణీ చేశారు. అలాగే డైరెక్టర్ అల్లూరి వెంకట సంజయ్ బూట్లు, హెల్మెట్‌లు, సేఫ్టీవెస్ట్‌లు, ఫైర్ రెసిస్‌స్టెంట్ షూట్లు అగ్నిమాపక శాఖాధికారి ఏవీవీఎస్ఎన్ వేణుకి అందజేశారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు కుటుంబానికి పరామర్శ

దేవరపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గౌరీపట్నంకి చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీసర్పంచ్ ఆండ్రూ వెంకటేశ్వరరావు ఇటీవల మృతిచెందటంతో శనివారం ఆయన నివాసానికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ వెళ్లి అతని కుమారుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆండ్రూ అనిల్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జవహర్ మాట్లాడుతూ ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. పరామర్శించిన వారిలో మాజీసర్పంచ్ కుసులూరి శ్రీనివాస్, వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు యాగంటి వెంకటేశ్వరరావు, వాసు, తదితరులు ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన స్కూల్ బస్సులపై కేసులు

కొవ్వూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన 16 ప్రైవేట్ పాఠశాలల బస్సులపై కేసులు నమోదు చేసినట్టు కొవ్వూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీ శివప్రసాద్ తెలిపారు. రవాణాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం దేవరపల్లి రోడ్డులో గల కొవ్వూరు గామన్‌బ్రిడ్జి అండర్‌టన్నెల్ వద్ద ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఎంవీఐ మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టప్రకారం ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించడం, బస్సుల్లో అటెండర్లు లేకపోవడం, అగ్నిమాపక యంత్రాలు, ఫైర్ అలారం ఏర్పాటు చేయకపోవడం, లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న అట్టి స్కూల్, కళాశాలల బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. దీనిలో భాగంగా రూ. 1,68,300 అపరాధ రుసుము విధించామన్నారు. ఈ తనిఖీలు ప్రతిరోజూ కొనసాగుతాయన్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.లక్ష్మీప్రవీణ ఉన్నారు.

మలకపల్లి ఉప సర్పంచ్‌కు మాతృవియోగం

తాళ్లపూడి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మలకపల్లి ఉప సర్పంచ్ మద్దిపాటి రామారావు మాతృమూర్తి మద్దిపాటి లక్ష్మి (92) శుక్రవారం రాత్రి మృతిచెందారు. ఆమె మృతిపై పలువురు టీడీపీ నాయకులు, స్థానికులు, తదితరులు సంతాపం తెలిపారు.

బాధిత కుటుంబానికి రూ. 3.50 లక్షల ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో మృతిచెందిన బాలిక కుటుంబానికి రూ. మూడు లక్షల ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం అందజేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన జొన్నకూటి సౌమ్యశ్రీ (15) విద్యుత్‌వైరు తగిలి ఈనెల 4వ తేదీన మృతిచెందింది. ఈ మేరకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, అధికారులు వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సౌమ్యశ్రీ తల్లితండ్రులు రామకృష్ణ, అరుణకుమారికు దాతలు అందించిన రూ. 3.50 లక్షల ఆర్థిక సాయాన్ని, మట్టి ఖర్చుల నిమిత్తం మరో రూ. 30 వేలును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా నిలబడతామన్నారు. ఇటువంటి ఘటనలు మరలా పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. విద్యుత్‌శాఖ అందించే నష్టపరిహారం రూ. ఐదులక్షలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, గారపాటి వెంకటకృష్ణ, ఎలక్ట్రికల్ ఏడిఈ ఎం. కృష్ణనాయక్, రూరల్ ఏఈ సీహెచ్ శ్రీనివాసరావు, పెనుమాక జయరాజు, కూటమి నేతలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌కు వినతి

కొవ్వూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీల్లో నివసించే మాదిగలు విద్య, వైద్యం, వసతి విషయాల్లో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఇంటిలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ ప్రెసిడెంట్ గెద్దాడ బాపిరాజు కోరారు. ఈమేరకు శనివారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను ఆ సంఘ సభ్యులు కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై జవహర్ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఎం. విద్యార్థి, ఎం. పిచ్చయ్య, వి.మొసలి బాబు, డా.భానుమూర్తి, డా.రాంబాబు, ఇ.కెంపురత్నం పాల్గొన్నారు.

చెల్లెల్ని కొట్టి గాయపర్చిన అన్నయ్యపై కేసు

కొవ్వూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): చెల్లెల్ని కొట్టి గాయపర్చిన అన్నయ్యపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 4వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో క్రిస్టియన్‌పేటకు చెందిన జగ్గం రమాదేవి ఇంటిలో పనిచేసుకుంటుండగా అన్నయ్య పోలిమాటి రాంబాబు తలపై కొట్టి గాయపర్చాడు. దీంతో చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు, రమాదేవి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.